క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 13, వంకాయ 18, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 20, దొండ 23–28, చిక్కుడు 50, గోకర 55, బీట్‌రూట్ 19, క్యాప్సికం 47, ఆలు 23, దోస 23, సొర 9, పొట్ల 15, ఉల్లి 14 చామగడ్డ 55. బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

నాగోలు: మహాత్మాజ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా మంగళవారం నాగోల్ డివిజన్ నువ్వులబండలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బహుజన సమాజ్ పార్టీ నాగోల్ డివిజన్ జనరల్ సెక్రెటరీ గట్టు రాజు ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఎల్‌బీనగర్ బహుజన్ సమాజ్ పార్టీ జనరల్ సెక్రెటరీ వేముగంటి సంపత్ హాజరై విద్యార్థులకు ప్లేట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రాగిరి మురళి, శంకర నేత, కిషోర్, నర్సింగ్ చారి తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పేదింటి ఆడబిడ్డల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు వరం లాంటివని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషా హాలోని కార్యాలయంలో మంగళవారం కమలానగర్, మూసానగర్, రసూల్‌పుర్, కాలాడేరా, ఆజంపురా, శంకర్‌నగర్, వాహేద్‌నగర్ ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, పల్టాన్ ప్రాంతాలకు చెందిన 100 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబర్‌పేట ఆర్‌ఐ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, ఎంఐఎం నేతలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా దాసురావు



బట్టు దాసురావుకు నియామకపత్రం అందజేస్తున్న మేడి పాపయ్య మాదిగ

మలక్‌పేట: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాల కమిటీ –2023 కన్వీనర్‌గా మలక్‌పేటకు చెందిన బట్టు దాసురావు నియమితులయ్యారు. ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ మేడి పాపయ్య మాదిగ ఆయనకు మంగళవారం నియామక పత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, కమిటీ వర్కింగ్ చైర్మన్లు మేడి పాపయ్యమాదిగ, జంగా శ్రీనివాస్ మాలకు దాసురావు ధన్యవాదాలు తెలియజేశారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బీజేపీ స్వచ్ఛభారత్ ఎల్‌బీనగర్ కన్వీనర్, లలితా నాగలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన కార్యదర్శి గంగదాసు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రిటైర్డ్ ఎస్పీ శశిధర్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శశిధర్‌రాజు మాట్లాడుతూ, కాలనీవాసులు అవసరాల దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు కరణం శ్రీకాంత్, మాజీ అధ్యక్షుడు సయ్యద్‌జానీ, వెంకటాద్రి, డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అమర్నాథ్, అనంత్‌రెడ్డి, లోకనాథం, విజయలక్ష్మి, నర్సింహ, వెంకట్‌రెడ్డి, మంజుల, రమా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చేయూత

చైతన్యపురి: నిరుపేదలకు మదర్ థెరిస్సా డెఫ్ రిచ్ సొసైటీ అండగా ఉంటుందని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి నాగులపాటి సోమేశ్వర రావు తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ కోదండరాం నగర్ కాలనీకి చెందిన రాజు పేదరికంతో ఇబ్బందులు పడుతున్న విషయంతెలుసుకుని సంస్థ నిర్వాహకులు చేయూతనందించారు. రాజు కుటుంబానికి మంగళవారం 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, వెయ్యి రూపాయల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.శంకర్‌రావు, చారా మహేశ్, దామెర కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

- ఘనంగా పూలే జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ప్రముఖులు



ఎల్‌బీనగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటానికి ఆద్యుడుని, దళిత బహుజనోద్ధరణ కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడు. ఎల్‌బీనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పులే విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, టీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్‌లు మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, సామ రమణారెడ్డి, ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్ తదితరులు నివాళులర్పించారు. నాగోలు జైపురికాలనీలోని మహిళ భవన్‌లో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, జైపురికాలనీ అధ్యక్షులు శ్యామల యాదగిరి పూలేకు నివాళులర్పించారు.



ఎల్‌బీనగర్‌లో నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మలక్‌పేట: బాలదానమ్మబస్తీలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, నాయకులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సందడి సురేందర్‌రెడ్డి, హరిగౌడ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. అక్బర్‌బాగ్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ తదితరులు నివాళులర్పించారు.

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ఎస్ నాయకుడు పగడాల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆర్‌కేపురం చౌరస్తాలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ జ్యోతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళర్పించారు.



ఎల్‌బీనగర్‌లో.. నివాళులర్పిస్తున్న సామ రంగారెడ్డి



ఎల్‌బీనగర్‌లో.. నివాళులర్పిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ గంగిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ పాల్గొని జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు. సైదాబాద్‌లో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు.

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని జ్యోతిరావు విగ్రహానికి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.



ఆర్‌కేపురం చౌరస్తాలో.. బీఆర్ఎస్ నాయకులు



అక్బర్‌బాగ్‌లో బీజేపీ అధ్యక్షుడు నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న లింగాల హరిగౌడ్



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

కృష్ణానగర్ వాసులకు న్యాయం చేయాలి: సామ

లింగోజిగూడ: ఎల్‌బీనగర్‌లో ఓ నిర్మాణ సంస్థ జరిపిన పేలుళ్ల కారణంగా నష్టపోయిన కృష్ణానగర్ కాలనీ వాసులకు వెంటనే న్యాయం చేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. పేలుళ్ల కారణంగా దెబ్బతిన్న ఇళ్లను మంగళవారం ఆయన స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. కృష్ణానగర్ కాలనీ అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి రామకృష్ణ, నాయకులు చంద్రశేఖర్, విజయభాస్కర్, కృష్ణం రాజు, గంగాధర్, రాకేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన ఇళ్లను పరిశీలిస్తున్న రంగారెడ్డి

తాను మరణిస్తూ మరో నలుగురికి జీవితం



బక్కమ్మ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో నలుగురికి జీవితాన్ని ప్రసాదించిందో మహిళ. కామినేని ఆసుపత్రి ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం ... నల్లగొండ జిల్లా నూతనకల్‌కు చెందిన అనుగతల బక్కమ్మ (57) ఈనెల 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంట్లో అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న బక్కమ్మకు ఈనెల 10న సాయంత్రం బ్రెయిన్‌డెడ్ అయినట్లు కామినేని వైద్యులు కుటుంబసభ్యులకు తెలిపి అవయవ దానంపై వారికి అవగాహన కల్పించారు. అవయవ దానానికి వారు అంగీకరించడంతో బక్కమ్మ లివర్, ఒక కిడ్నీని కామినేని హాస్పిటల్‌కు, మరొక కిడ్నీని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు, కంటి కార్నియాలను సరోజినీదేవి కంటి ఆసుపత్రికి అందజేశారు. అవసరమైన వారికి వీటిని అమరుస్తామని వైద్యులు తెలిపారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదాసమేత వెంకటేశ్వర స్వామి ఆలయ పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శ్రీవారి తిరుకల్యాణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావు పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం కాలనీ వీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని మేళ తాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కమలేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు నర్సిరెడ్డి, శ్రీదేవి, చంద్రగుప్తా, రవీందర్‌రెడ్డి, నరసింహగుప్తా పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తికి 3 రోజుల జైలు

మలక్‌పేట: విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తికి కోర్టు మూడు రోజులు జైలు శిక్ష విధించిందని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కస పరాజు శ్రీనివాస్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసారంబాగ్‌లో నివాసం ఉంటున్న కరణ్ రవికాంత్(50) దేవాదాయ శాఖలో పని చేస్తున్నాడు. 2023 మార్చి 21 తేదీన డ్యూటీలో ఉన్న పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి వారి విధులకు ఆటంకం కలిగించినందుకు అతడిపై కేసు నమోదు చేశారు. మంగళవారం నాంపల్లిలోని 7వ స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రవికాంత్‌కు మూడు రోజులు జైలు శిక్ష విధించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

హస్తినాపురం: అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైదేహినగర్ కాలనీకి చెందిన గోవింద్ దేశ్‌ముఖ్‌కి జవహర్‌నగర్‌కు చెందిన శ్వేతాతివారీతో 2020 డిసెంబర్‌లో వివాహం జరిగింది. పెళ్లైనప్పటి నుంచీ భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం ఆమెను వేధించడం మొదలు పెట్టారు. కాగా భర్తతో గొడవ జరగడంతో ఏడాది కాలంగా శ్వేత తన తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ ఏడాది జనవరిలో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరి మధ్య సయోధ్య కుదిరింది. దీంతో శ్వేత భర్తతో కాపురానికి వనస్థలిపురానికి వచ్చింది. ఇంటికి వచ్చిన వారం రోజుల అనంతరం తిరిగి ఆమెను వేధించడం మొదలు పెట్టారు. అందులో భాగంగా ఆమె ఫోన్, బంగారు ఆభరణాలు లాక్కుని శారీరకంగా, మానసికంగా అత్తింటివారు వేధించారు. వేధింపులు తాళలేక సోమవారం రాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిధులు లేకుండా 'పట్టణ ప్రగతి' కార్యక్రమమా?

– అధికారులను ప్రశ్నించిన కార్పొరేటర్

ఎల్‌బీనగర్: నిధులు లేకుండా కాలనీల్లో పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించడం ఎందుకని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమం మంగళవారం డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ కమూనిటీ హాల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో సమస్యల పరిష్కరం కోసం నిధులు కేటాయించి పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తే బాగుంటుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించకుండా తూతూ మంత్రంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. డివిజన్‌లోని చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీ మారుతిదివాకర్ మాట్లాడుతూ, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా సర్కిల్ పరిధిలోని అన్ని కాలనీల్లో వంద రోజుల పాటు సమావేశాలు నిర్వహించి కాలనీవాసుల నుంచి సమస్యలు తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అమరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

నిరుద్యోగులకు న్యాయం చేయాలి



టీ సేవ్ ఫోరం లోగోను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌టీపీ నాయకులు

నాగోలు: టీఎస్‌పీఎస్సీ నిరుద్యోగులకు సరైన న్యాయం చేయాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మామిడి రాంచందర్ అన్నారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో రూపొందించిన టీ సేవ్ లోగోను మంగళవారం ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మామడి రాంచందర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురువుతున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నిరుద్యోగల కోసం వైఎస్ షర్మిల రూపొందించిన టీ సేవ్ ఫోరంకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పల్లె అజయ్‌కుమార్, ఎస్‌కే మాసూమ్, పోచబోయిన శ్రీకాంత్, కోట్ల వాసుదేవ్, ఆకుల వెంకటేష్, లక్ష్మణ్, మధు, లక్పతి నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

– ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ బీఆర్ఎస్ యువ నాయకుడు సాయికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్‌కు చెందిన దాదాపు 100 మంది యువకులు సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. సుధీర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి యువకులు బీఆర్ఎస్‌లో చేరారని అన్నారు. బీఆర్ఎస్ ప్రధాన లక్ష్యమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు సాధించుకున్న తెలంగాణలో అన్ని రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందన్నారు. తాగు, సాగునీరు, సంక్షేమం, విద్యుత్, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. కార్యక్రమంలో ఠాగూర్, రోహన్ సింగ్, ఠాగూర్, వినయ్ కుమార్ సింగ్, ఠాకూర్ మోహిత్ సింగ్, సాయి వర్ధన్, గోపాల్, వంశీ, వర్షిత్, ప్రణవ్, జీవన్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేసిన యువకులు

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రెవెన్యూబోర్డ్ కాలనీ పార్క్‌లో జీహెచ్‌ఎంసీ, ట్రాన్స్‌కో, పోలీస్, శానిటేషన్, ఎంటమాలజీ అధికారులు, రెవెన్యూ బోర్డ్ కాలనీ, ఆంధ్రాబ్యాంక్ కాలనీ, వెంకటాద్రినగర్ కాలనీవాసులతో కార్పొరేటర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కాలనీల్లో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారు కార్పొరేటర్ ద్వారా ఆయా అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పలు ప్రాంతాల్లో తీగునీరు డ్రైనేజీ పైప్‌లైన్లు ఆధునీకరిస్తామన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో అంతర్గత రహదారులు నిర్మిస్తామన్నారు. అదే విధంగా కాలనీవాసులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులతో చర్చించి త్వరలో పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

నాగోలు: కొత్తపేట డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం కొత్తపేట డివిజన్ న్యూమారుతి నగర్ – సమతాపురి కాలనీలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 'ఇంటెన్సివ్ శానిటేషన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ డీసీ కృష్ణయ్య, ఎస్‌ఐ కృష్ణ పాల్గొన్నారు. సమావేశంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అడిగి డ్రైనేజీ, రోడ్డు, శానిటైజేషన్, నీటి, ట్రాఫిక్ సమస్యలు తెలుసుకున్నారు. కాలనీల్లోని సమస్యలను అధికారులు పరిష్కరించాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి బుచ్చయ్య, వాటర్ వర్క్స్ అధికారులు అరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రాంకీ అధికారులు విజయభారతి, ఇతర అధికారులు, కాలనీ అధ్యక్షుడు మల్లేష్ , దొడ్డు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

వనస్థలిపురం: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి అన్ని విభాగాల అధికారులు కలసికట్టుగా కృషి చేయాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కమలానగర్, భూలక్ష్మీనగర్‌ల్లోని సమస్యల పరిష్కారం కోసం జలమండలి, విద్యుత్, ఇంజినీరింగ్, శానిటేషన్, ఎంటమాలజీ తదితర విభాగాల అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.వేసవి కాలం దృష్ట్యా విద్యుత్, జలమండలి అధికారులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

నాగోలు: నాగోలు డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, జరగాల్సిన పనులను తొందరగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం నాగోల్ డివిజన్‌లోని సమస్యలపై ఇంజినీరింగ్ విభాగం, డీసీ మారుతి దివాకర్, ఎస్సీ అశోక్ రెడ్డి, ఈఈ రమేష్ బాబు, ఏఈ చంద్రశేఖర్ రెడ్డితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగోల్ డివిజన్ లో జరుగుతున్న పనులు, జరగాల్సిన పనులను తొందరగా పూర్తి చేయాలని కోరారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, నాగోల్ చెరువులో పూడిక తీయాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ పనులు, నాలా పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు.